
సాక్షి
బాపట్ల
సోమవారం । 11 । సెప్టెంబర్ । 2023




సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 524.40 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 854.70 అడుగుల వద్ద ఉంది.



సూర్యలంకలో బీచ్ క్లీనింగ్

బాపట్ల: సూర్యలంక బీచ్‌లో ఎన్‌సీసీ విద్యార్థులు పూనితే సాగర్ అభియాన్ బీచ్ క్లీనింగ్ చేపట్టారు. ఎన్‌సీసీ ఆఫీసర్ కత్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు ఆదివారం 6034 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 2420 క్యూసెక్కులు విడుదల చేశారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

ఈ నెల 15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష అమలు

- ఇంటింటికీ ఆరోగ్య సమస్యలపై సర్వే
- పల్లె, పట్టణాల్లో 30 నుంచి వైద్య శిబిరాలు ఏర్పాటు
- సొంతూళ్లలోనే సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు
- సన్నద్ధం అవుతున్న యంత్రాంగం
- రూ.120 కోట్లతో నిర్వహణకు ప్రభుత్వం సిద్ధం
- అవసరమైతే పెద్ద ఆస్పత్రుల్లో ఉచితవైద్యానికి చర్యలు
- పేదల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి కొత్త పథకానికి శ్రీకారం
- పక్కా ప్రణాళిక రూపొందించిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి విడదల రజిని



జగనన్న ఆరోగ్య సురక్షపై వైద్య, మున్సిపల్ కమిషనర్స్, ఎంపీడీఓలతో సమీక్షిస్తున్న మంత్రి విడదల రజిని

యడ్లపాడు: విప్లవాత్మక చర్యలతో, వినూత్న పథకాలతో దేశమంతా రాష్ట్రం వైపు చూసేలా చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ ప్రజారోగ్య పరిరక్షణకు విశేషంగా కృషి చేస్తోంది. నాడు–నేడు కార్యక్రమంలో పట్టణాలు, మండల కేంద్రాల్లోని సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలను అత్యాధునిక హంగులతో నిర్మించింది. సుదీర్ఘంగా ఉన్న ఖాళీలను భర్తీచేసి వైద్యులను అందుబాటులోకి తెచ్చింది. గ్రామ/వార్డు సచివాలయ పరిధిల్లో విలేజ్, అర్బన్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. వీటిద్వారా 12 రకాల వైద్య సేవలు, 16 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులను రోగులకు ఉచితంగా అందిస్తోంది. పెద్దఎత్తున 108 వాహనాలను ఏర్పాటు చేసి సమాచారమిచ్చిన క్షణాల్లో అత్యాధునిక వైద్యం లభించే ఆస్పత్రులకు చేరేలా వసతులు సమకూర్చింది. అలాగే దీర్ఘకాలిక వ్యాధుల వారికి 104 వాహనాల ద్వారా ప్రతినెలా గ్రామాల్లో వైద్యం, మందులను ఉచితంగా పంపిణీ చేస్తోంది. వీటితో పాటు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్(ఏబీడీఎం) కార్యకలాపాల అమల్లో రాష్ట్ర వైద్యశాఖ దేశంలోనే ఉత్తమ పనితీరుకు ప్రతీకగా రాష్ట్రం నిలిచింది. 2021లో ప్రారంభించిన టెలీ మెడిసిన్ ద్వారా వయోవృద్ధులు, మహిళలకు సేవలు అందించడంలో ఏపీ అగ్రస్థానంలో ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రకటించింది. 2022లో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను ప్రారంభించి రోగి ఇంటికే వైద్యుడు నేరుగా వెళ్లి సేవలను అందిస్తున్న ఘనతను ఏపీ సర్కార్ సొంతం చేసుకుంది. తాజాగా జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట బృహత్తర కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చేందుకు సిద్ధమైంది. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని అందుకు రాష్ట్రంలోని ప్రతివ్యక్తి సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీనిని రూపొందించి రూ.120 కోట్లను కేటాయించారు. ఇందుకు అనుగుణంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఈనెల 30 నుంచి కార్యాచరణలోకి తెచ్చేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ప్రణాళిక చేశారు.

జిల్లాలో 385 మెగా వైద్యశిబిరాల నిర్వహణ

ఇప్పటికే జిల్లా ఉన్నతస్థాయి అధికారులకు ఈనెల 7న కార్యక్రమంపై అవగాహన కల్పించారు. సోమవారం జిల్లా వైద్యాధికారి ఆధ్వర్యంలో రెండోదశ శిక్షణ ఇవ్వనున్నారు. రాష్ట్రస్థాయి వైద్యబృందం కూడా దీనిపై అవగాహన కల్పిస్తారు. 15న వలంటీర్లు సురక్ష షెడ్యూల్ వివరాలు తెలియజేస్తారు. 16 నుంచి ఏఎన్‌ఎం, ఎంపీహెచ్‌ఎల్‌లు ఇంటింటి సందర్శన చేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి క్యాంప్ నిర్వహణ తేదీ టోకెన్‌లు, 20న ఆరోగ్యశ్రీ కరపత్రాలు పంపిణీ చేస్తారు. 30న మొదటి సురక్ష క్యాంపు ప్రారంభిస్తారు. షెడ్యూల్ ప్రకారంగా నెలరోజులు వేర్వేరు ప్రాంతాల్లో కొనసాగుతుంది. జిల్లాలోని 28 మండలాల్లో 361 విలేజ్ క్లినిక్‌లు, 24 అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో 385 మెగా శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు.

స్పెషలిస్టుల పర్యవేక్షణలో...

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈనెల 30 నుంచి ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతంలో పాఠశాలలు లేదా అనువైన భవనాల్లో ఏర్పాటు చేస్తారు. పట్టణాల్లో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద శిబిరాలు నిర్వహిస్తారు. విద్యార్థులతో పాటు రక్తహీనత ఉన్న బాలికలకు శిబిరానికి వచ్చే ముందే స్క్రీనింగ్ నిర్వహిస్తారు. ప్రతి శిబిరానికి వచ్చే ముందే స్క్రీనింగ్ నిర్వహిస్తారు. ప్రతి శిబిరం వద్ద ఇద్దరు స్పెషలిస్టు, స్థానిక పీహెచ్‌సీల్లోని ఇద్దరు వైద్యులను ప్రభుత్వం కేటాయించింది.

పలుశాఖల భాగస్వామ్యం..

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ఏర్పాటు బాధ్యతను గ్రామీణ ప్రాంతంలో ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు, ఆయా పీహెచ్‌సీ వైద్యులకు, పట్టణంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులకు అప్పగించారు. మండలంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లను సమానంగా విభజించి ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు, వైద్యుల సమన్వయంతో మెడికల్ క్యాంపులను షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తారు. పట్టణంలో మున్సిపల్ కమిషనర్, హెల్త్ ఆఫీసర్, వైద్యుల భాగస్వామ్యంతో శిబిరాలు కొనసాగుతాయి. జిల్లాస్థాయిలో వైద్య ఆరో గ్యశాఖ అధికారులతో పాటు జెడ్పీ సీఈఓ, జిల్లా పంచాయతీ అధికారి, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీలు బృందాలుగా పర్యవేక్షిస్తారు.

సురక్ష లక్ష్యాలిలా..

- ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై సర్వే చేయడం
- వలంటీర్లు తమ క్లస్టర్ పరిధిలో ఇళ్లకు వెళ్లి షెడ్యూల్‌ను తెలియజేయడం
- ఏఎన్‌ఎంలు ఇంటింటికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం
- ఆరోగ్య వివరాల కేస్‌షీట్, పరీక్ష ఫలితాలను వైద్యులకు అందించడం
- ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయడం
- శిబిరం ద్వారా పరీక్షలు, చికిత్స, ఉచితంగా మందులు పంపిణీ
- అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం స్పెషలిస్టు వైద్యులు, పెద్ద ఆస్పత్రులకు సిఫార్సు
- సురక్ష ద్వారా అందరికీ అన్ని ఆరోగ్య సమస్యల్ని పరిష్కరించడం.

మెగా క్యాంప్‌లతో పేదలకు ప్రయోజనం



గ్రామ/వార్డుల పరిధిలో ఈనెల 30 నుంచి ప్రారంభించే సురక్ష ఎంతో ఉపయోగకరమైంది. ఈనెల 15 నుంచే వైద్య సిబ్బంది గడప గడపకు వెళ్లి అవసరమైన పరీక్షలు నిర్వహిస్తారు. వారికి శిబిరం నిర్వహణ వివరాలున్న టోకెన్ ఇస్తారు. మెగా వైద్యశిబిరాల తరహాలో ఏర్పాటయ్యే ఈ శిబిరంలో రెండు పీహెచ్‌సీల వైద్యులతో పాటు స్పెషలిస్టులు పాల్గొంటారు. అదనపు పరీక్షలు అవసరమైతే క్యాంప్‌లో చేస్తారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఫ్యామిలీ డాక్టర్ ఒకమైలు రాయికాగా, ఆరోగ్య సురక్ష అమలుతో మరొక ముందడుగు వేయబోతున్నాం.

– బి.రవి, పల్నాడు జిల్లా వైద్య అధికారి

చంద్రబాబుకు వత్తాసు తగదు

- ప్రజాధనం లూటీ చేసిన ఘనుడు..
- ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



రేపల్లె రూరల్: ప్రజాధనాన్ని లూటీ చేసిన చంద్రబాబుకు మద్దతుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరి, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, వామపక్షాలు వత్తాసు పలకటాన్ని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు తప్పుబట్టారు. పట్టణంలోని ఆయన వ్యక్తిగత కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్ణయాన్ని అప్పటి ఆర్థికశాఖ అభ్యంతరాలు తెలిపినా, మంత్రి వర్గ నిర్ణయం లేకుండానే తన సొంత నిర్ణయంతో చంద్రబాబు కోట్ల రూపాయలను దారిమళ్లించారని చెప్పారు. ఆ తప్పుడు నిర్ణయాన్ని అప్పటి ఆర్థిక శాఖలో ఉన్న ఐఏఎస్‌లు తీవ్రంగా వ్యతిరేకించినా చంద్రబాబు వారిపై ఒత్తిడి తెచ్చి అక్రమ జీఓను జారీ చేయించారని పేర్కొన్నారు. సీమెన్ కంపెనీతో ఒప్పందం లేకపోయినా ఒప్పందం ఉన్నట్లుగా డాక్యుమెంట్‌లు సృష్టించి ప్రజాధనాన్ని కొల్లగొట్టటంతో పాటు నిరుద్యోగ యువతతో ఆటలాడారని విమర్శించారు. పక్కా. ఆధారాలతో పట్టుబడ్డ చంద్రబాబుకు ఈ సారి న్యాయపరంగా శిక్ష తప్పదన్నారు. చంద్రబాబు విచారణను తప్పుత్రోవ పట్టించేందుకు నాకు తెలియదు, గుర్తులేదు, మర్చిపోయా అంటూ కేసు పక్కతోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాడని పేర్కొన్నారు. ప్రజాధనంను కొల్లగొట్టిన చంద్రబాబుకు వత్తాసు పలికేవారు వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. చంద్రబాబు చేసిన తప్పులకు న్యాయపరమైన చర్యలు తప్ప కక్షసాధింపు చర్యలు కాదని తెలుసుకోవాలని మోపిదేవి వివరించారు.

న్యూస్‌రీల్

పూర్ణప్రజ్ఞాచారికి జాతీయ లెజండరీ పురస్కారం



తెనాలి: తెనాలి రూరల్ మండలం కొలకలూరుకు చెందిన నూతక్కి పూర్ణప్రజ్ఞాచారికి విశ్వకర్మ సేవాట్రస్ట్ జాతీయ లెజండరీ అవార్డును ప్రదానం చేసింది. విజయవాడ చిట్టినగర్‌లోని విశ్వబ్రాహ్మణ కల్యాణమండపం వేదికపై జరిగిన పురస్కారాల ప్రదానోత్సవంలో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంతాచారి, విశ్వకర్మ ట్రస్ట్ చైర్మన్ బాలబ్రహ్మచారి, జ్యోతిష్యం, వాస్తు, పంచాంగ పండితుల చేతులమీదుగా వీటిని అందజేశారు. మహాకవి గుర్రం జాషువా ప్రియశిష్యుడైన 'మధురకవి' నూతక్కి అబ్రహాం కుమారుడు పూర్ణప్రజ్ఞాచారి. పద్యరచనలో అందెవేసిన చేయిగా పలు అవార్డులను అందుకున్నారు.

ప్రారంభమైన దసరా క్యూలైన్ పనులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో అక్టోబర్ 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరిగే దసరా ఉత్సవాలకు అవసరమైన క్యూలైన్ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. కెనాల్‌రోడ్డులోని వినాయకుడి గుడి, ఘాట్‌రోడ్డులోని మొదటి మలుపు వద్ద క్యూలైన్ పనులకు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు కెనాల్‌రోడ్డులోని వినాయకుడి గుడి వద్దకు చేరుకున్న చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ తొలుత విఘ్నాలు తొలగించే గణనాథుడిని దర్శించుకున్నారు. క్యూలైన్లు ప్రారంభమయ్యే చోట అమ్మవారి చిత్రపటాన్ని ఉంచి పూజలు నిర్వహించిన అనంతరం కొబ్బరి కాయ కొట్టి పనులను ప్రారంభించారు. దసరా ఉత్సవాలు జరిగే అక్టోబర్ మొదటి వారం నాటికి పనులు పూర్తయ్యేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చైర్మన్, ఈవోలు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డీపీఓలో వీరభద్రేశ్వర స్వామి మహోత్సవాలు



నగరంపాలెం: స్థానిక నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయం(డీపీఓ) ఆవరణలో వేంచేసిన వీరభద్రేశ్వర స్వామి మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి దంపతులు, గుంటూరు ఏఎస్పీ కె.సుప్రజ (పరిపాలన) దంపతులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉమ్మడి జిల్లాల పోలీస్ అధికారులు, సిబ్బంది స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందించారు.

రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో సత్తా

బాలికల విభాగంలో ద్వితీయ స్థానం



చీరాల రూరల్: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో బాపట్ల జిల్లా బాలికలు, బాలుర జట్లు విజయకేతనం ఎగురవేశాయని జిల్లా షూటింగ్ బాల్ అధ్యక్షుడు డాక్టర్ ఇస్తర్ల బాబూరావు తెలిపారు. నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో ఆదివారం షూటింగ్ బాల్ మెన్ అండ్ ఉమెన్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో బాలికల జట్టు ద్వితీయ స్థానం, బాలుర జట్టు నాలుగో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. డాక్టర్ బాబూరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడా పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ చూపాలని సూచించారు. పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులను, జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన కమిటీ సభ్యులు, కోచ్ హరితలను ఆయన అభినందించారు.

బాబు డ్రామాలకు నేటితో తెరపడింది

వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి




మాచర్ల: ప్రజలను మోసగించిన పాపం, సొంత మామ ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచి, చెప్పులు విసిరేయించిన శాపం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఈ రోజు తగిలిందని, అందుకే జైలు పాలయ్యాడని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలను మోసగిస్తూ బతికిన చంద్రబాబు పిల్లనిచ్చిన మామను బలి తీసుకున్నాడన్నారు. ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీపార్వతి పేరును అడ్డం పెట్టుకొని బాబు డ్రామాలాడి దొడ్డిదారిలో సీఎం అయ్యాడన్నారు. ఆ తరువాత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబాన్ని తూలనాడి ,అర్ధరాత్రి కాంగ్రెస్ నాయకుడు చిదంబరంతో మంతనాలాడి సీఎం వైఎస్ జగన్‌ను జైలు పాలు చేసిన చరిత్ర చంద్రబాబుది అన్నారు. అందుకే దేవుడు స్క్రిప్ట్ రాశాడని, దానికి తగ్గట్లే జైలు జీవితం అనుభవించబోతున్నాడని చెప్పారు. స్కిల్ కుంభకోణంకు సంబంధించి అన్ని ఆధారాలు పక్కాగా ఉండడంతో ఈసారి కోట్ల రూపాయలతో వాదించే న్యాయవాదులు బాబును కాపాడలేకపోయారన్నారు. చంద్రబాబు ఇకనైనా బుద్ధితెచ్చుకుని, ప్యాకేజి స్టార్, దత్తపుత్రుడిని అడ్డం పెట్టుకొని ఆడే నాటకాలు ఆపాలని హితవు పలికారు.

సానుభూతి కాదు.. సంబరాలు చేసుకుంటున్నారు..

తాను అరెస్టు అయితే ప్రజల్లో ఏదో సానుభూతి వస్తుందని చంద్రబాబు భావించాడని, ప్రజలను రెచ్చగొట్టేందుకు టీడీపీ నేతలు నానా ప్రయత్నాలు చేశారన్నారు. కానీ ఎక్కడా ఎవరూ స్పందించలేదని, కనీసం పట్టించుకోలేదన్నారు. పైపెచ్చు తగిన శాస్తి జరిగిందంటూ ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారని చెప్పారు. నీచ రాజకీయాలకు స్వస్తి పలికి, ప్రజల వద్ద తప్పులు ఒప్పుకొని బతకాలని పీఆర్కే హితవు పలికారు. లేకపోతే మరింత కుమిలిపోయే పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్ల టౌన్: శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు. జిల్లా క్యాంప్ కార్యాలయంలో ఆదివారం రాత్రి సాక్షితో మాట్లాడారు. బంద్, నిరసన కార్యక్రమాలు, ఆందోళనలకు అనుమతులు లేవని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై వచ్చి ప్రవర్తించినా, దుకాణ యజమానులను బెదిరించి బలవంతంగా షాపులు మూయించినా, వాహనాల విధ్వంసానికి పాల్పడినా అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు కూడా సమయమనం పాటించి ప్రజలు స్వేచ్ఛకు భంగం కలిగించకుండా చూడాలన్నారు. ఇప్పటికే అల్లర్లు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో పోలీసులతో నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడి సహకరించాలని కోరినట్లు చెప్పారు.

ఓటరు జాబితాను సమర్థంగా సిద్ధం చేయండి

పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్

నకరికల్లు: ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు సమర్థవంతంగా నిర్వహించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎస్.శివశంకర్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం రికార్డులు పరిశీలించారు. గతనెలరోజుల పాటు బీఎల్‌ఓలు చేపట్టిన ఓటరు జాబితా గురించి పరిశీలన చేశారు. గతేడాది వివిధ కారణాల వలన తొలగించిన 2,553 ఓట్ల వివరాలు మరోసారి పరిశీలన చేశారు. ఓటరు నమోదు, తొలగింపు, అడ్రస్ మార్పు, పేర్ల సవరణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆన్‌లైన్, బీఎల్‌ఓల ద్వారా వచ్చిన దరఖాస్తులు సకాలంలో పరిష్కరించి నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.



తహసీల్దార్ కె.నగేష్ వద్ద రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఎల్.శివశంకర్

సానుభూతి కోసం అడ్డదారులు

- ఒక రోజు ముందు చనిపోయిన వారు కూడా చంద్రబాబు ఖాతాలో..
- ఈనెల 8వ తేదీన గుండెపోటుతో శివయ్య యాదవ్ మృతి
- 9న చంద్రబాబును అరెస్ట్ చేయడంతో మనస్థాపంతో మృతిచెందారంటూ రాతలు
- ఈనాడు పచ్చ పైత్యం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: చంద్రబాబు నాయుడి అరెస్టు నేపథ్యంలో సానుభూతి కోసం తెలుగుదేశం నాయకులు ఎంతటి అడ్డదారులు తొక్కడానికైనా సిద్ధం అయ్యారు. ఒకరోజు ముందు అనారోగ్యంతో చనిపోయిన వ్యక్తిని కూడా చంద్రబాబునాయుడి అరెస్టు నేపథ్యంలో చనిపోయినట్లు చిత్రీకరించారు. ఇంకేముంది అవకాశం కోసం ఎదురుచూస్తున్న పచ్చపత్రిక ఈనాడు దానిని తన ఇంటర్‌నెట్ ఎడిషన్‌లో పోస్టు చేసింది.

ఆ వార్త సారాంశం ...

' చంద్రబాబు అక్రమ అరెస్టు వార్త వినగానే గుంటూరు రూరల్ మండలంలోని బుడంపాడు గ్రామ బీసీ నాయకుడు శివయ్య యాదవ్ గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన భౌతిక కాయానికి గుంటూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి కల్లూరి శ్రీనివాస్, పార్టీ నేతలు ఇమ్మడి లీలా మల్లేశ్వరరావు, రమేష్, యాదాల గణేష్, పెండ్యాల శ్రీధర్ బాబు తదితరులు శివయ్య భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.'



మైలా శివయ్య శ్రద్ధాంజలి ఫ్లెక్సీ

వాస్తవం...

గుంటూరు రూరల్ మండలం బుడంపాడుకు చెందిన మైలా శివయ్య యాదవ్(65) శుక్రవారం రాత్రి పది గంటల సమయంలో గుండె నొప్పిగా ఉందని తన కుమారులకు చెప్పాడు. దీంతో వారు శివయ్యను చికిత్స కోసం గుంటూరు ఆసుపత్రికి తరలిస్తుండగా రాత్రి 11 గంటల సమయంలో గ్రామ శివార్లలో మృతి చెందాడు. అతనికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వారు రాత్రికి రాత్రే తమ తండ్రి మృతిపై శుక్రవారం 08-09-2023న మృతి చెందినట్లుగా ఫ్లెక్సీలు వేసి గ్రామం అంతా కట్టారు. శనివారం ఉదయం 11.30 గంటలకు అంత్యక్రియలు జరిగాయి. అయితే శనివారం చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక శివయ్య మృతి చెందాడంటూ తెలుగుదేశం నేతలు ప్రచారం మొదలు పెట్టారు. దీనికి ఈనాడు వంతపాడింది.



ఈనాడు ఇంటర్‌నెట్ ఎడిషన్‌లో పెట్టిన వార్త

కనకదుర్గమ్మకు లక్ష కుంకుమార్చన

- ఆదివారం కావడంతో పెరిగిన భక్తులు
- ఆర్జిత సేవల్లో ఉభయదాతలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రావణ మాసం ఆఖరి ఆదివారం కావడంతో ఇంద్రకీలాద్రికి భక్తుల రద్దీ కొనసాగింది. వరుస సెలవుల నేపథ్యంలో మూడు రోజులుగా ఇంద్రకీలాద్రికి భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆది దంపతులకు నిర్వహించిన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీహోమం, శాంతి కల్యాణం, నవగ్రహ హోమం వంటి ఆర్జిత సేవలతో పాటు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని నిర్వహించిన విశేష కుంకుమార్చన, సూర్యోపాసన సేవలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. ఉదయం 9 గంటల నుంచి రద్దీ మరింత పెరగడంతో వారికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లను చైర్మన్ రాంబాబుతో పాటు ఆలయ అధికారులు పర్యవేక్షించారు. మహా నివేదనకు అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. మహా నివేదన అనంతరం భక్తుల రద్దీ మరింత పెరగడంతో దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.



అమ్మవారి దర్శనం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



లక్ష కుంకుమార్చనలో ఉభయదాతలు

ఉచిత కంటి వైద్య పరీక్షలు

ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై రాజగోపురం ఎదుట ఉచిత కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. శాంతి కల్యాణం వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పలువురు ఆలయ సిబ్బందితో పాటు అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు సైతం వైద్య సేవలను వినియోగించుకున్నారు. కంటి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు.

సూర్యోపాసన సేవ

ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ నిర్వహించారు. రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ జరిగింది. సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొనగా, వారికి ప్రత్యేక క్యూలైన్ మార్గంలో అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

తప్పు చేస్తే శిక్ష తప్పదు



– చీరాల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

చీరాల: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఏ1 గా ఉన్నాడని, తప్పు చేశాడు కాబట్టే స్పష్టమైన ఆధారాలు ఉండటంతో న్యాయస్థానం జైలుకు పంపిందని చీరాల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. చట్టం ముందు అందరూ సమానులేనని, తప్పు చేసిన వారు ఎవ్వరూ తప్పించుకోలేరని చెప్పారు. అయితే చంద్రబాబు అరెస్టు, రిమాండ్ నేపథ్యంలో దత్తపుత్రుడైన పవన్‌కళ్యాణ్ రాష్ట్రంలో అలజడులు, గొడవలు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. గతంలో వైఎస్ జగన్‌ను అరెస్టు చేసి అక్రమంగా 16 నెలలు జైలులో పెట్టినప్పుడు నోరుమెదపని చాలా రాజకీయ పార్టీలు స్కిల్ స్కాంలో అడ్డంగా దొరికిన చంద్రబాబును అరెస్టు చేస్తే గగ్గోలు పెట్టడం దారుణమని పేర్కొన్నారు. ఈ స్కాంతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరూ చట్టం నుంచి తప్పించుకోలేరని వెంకటేష్ చెప్పారు.

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో బాబుకు శిక్ష



– ఏపీ శాప్‌నెట్ చైర్మన్ కృష్ణ చైతన్య

అద్దంకి: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకుడికి శిక్ష తప్పదని ఏపీ శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య పేర్కొన్నారు. నలభై సంవత్సరాలనుంచి కేసులను కోర్టుల్లో మేనేజ్ చేసుకుంటూ వచ్చాడని చెప్పారు. కేసులను మేనేజ్ చేసుకోవడంలో చంద్రబాబు దిట్ట అని వివరించారు. ఎప్పుడూ మేనేజ్ చేసుకోవాలంటే కుదరదు అందుకే పాపం పండిందని చెప్పారు. నేను నిప్పు నేను నిప్పు అని చెప్పుకునే బాబు ఇప్పుడేం చెబుతారని ప్రశ్నించారు. ఇదొక్కటే కాదు.. ఇంకా చాలా కేసులున్నాయని, వాటన్నింటికి సంబంధించి బాబుకు శిక్ష తప్పదని పేర్కొన్నారు. ఉత్తి పుణ్యానికి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కక్ష కట్టి జైలుకు పంపిన దానిలో చంద్రబాబు పాత్ర ఉందని ఆరోపించారు.

శాస్త్రీయ దృక్పథమే అభివృద్ధికి చోదకశక్తి

ఎమ్మెల్సీ లక్ష్మణరావు



చీరాల టౌన్: శాస్త్రీయ దృక్పథమే రాష్ట్రాభివృద్ధికి చోదక శక్తి అని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. పట్టణంలోని పద్మశాలీయ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న జేవీవీ 17వ రాష్ట్ర మహాసభల్లో రెండో రోజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ అధికారంలో ఉన్న ప్రభుత్వాలు రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పని చేస్తున్నాయని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫెడరల్ వ్యవస్థను ధ్వంసం చేసి వ్యక్తి ఆలోచనల చుట్టూ వ్యవస్థను తిప్పుకుంటున్నాయని అన్నారు. రాజకీయ ప్రయోజనాలకు సైన్స్ ప్రయోగ ఫలితాలను విశ్వాసాలకు ముడిపెట్టడం దుర్మార్గమని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, రాష్ట్ర నాయకులు రాజశేఖర్ రాహుల్, రమేష్, త్రిమూర్తులు, బోయా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక..

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభల్లో నూతన రాష్ట్ర కమిటీని 74 మందితో ఎన్నుకున్నారు. ఆదివారం చీరాల్లో నిర్వహించిన జేవీవీ మహాసభల్లో గౌరవాధ్యక్షుడిగా జీ శివన్నారాయణ, చెలికాని స్టాలిన్, చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షులుగా ఎం.గేయానంద్, రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కుర్రా రామారావును ఎన్నుకున్నారు.

అభివృద్ధి దిశగా మేదరమెట్ల ప్రాంతం

టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



మేదరమెట్లలో మాట్లాడుతున్న టీటీడీ మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి

మేదరమెట్ల: అభివృద్ధి దిశగా మేదరమెట్ల ప్రాంతం దూసుకెళ్తోందని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆదివారం శంకుస్థాపన చేశారు. తొలుత గ్రామంలోకి అడుగిడిన వైవీకి గజమాలలతో, మేళతాళాలతో గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. సోమవరప్పాడులో నాభిశిల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సమీపంలోని పశువుల ఆస్పత్రి ఆవరణలో సుమారు రూ.45 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న భవనానికి వైవీతో పాటు నియోజకవర్గ పరిశీలకుడు ఎం.వెంకారెడ్డి, శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య శంకుస్థాపనలో పాల్గొన్నారు. గ్రామ శివారుల్లో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. టీటీడీ ఆధ్వర్యంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించే దేవస్థానానికి శంకుస్థాపనలు నిర్వహించారు. మేదరమెట్ల దక్షిణ బైపాస్ ప్రాంతంలో అక్షర క్యాపిటల్ సిటీలో ఏర్పాటు చేయనున్న ఇంటర్‌నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైవీ మాట్లాడుతూ మేదరమెట్ల లాంటి గ్రామంలో ఇంటర్‌నేషనల్ స్కూల్ రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచి బొనిగల ఎలిశమ్మ, మాజీ సర్పంచులు జజ్జర ఆనందరావు, పేరం నాగలక్ష్మి, ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్లు వై.రత్నారెడ్డి, కోయి అంకారావు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రతినిధి రామరాజు పాల్గొన్నారు.

శింగరకొండ దేవస్థాన అభివృద్ధికి కృషి

- టీటీడీ దేవస్థాన మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి
- రూ.6 కోట్లతో రాతి మండపం నిర్మాణం



బాలాలయం వద్ద పూజలు చేస్తున్న సుబ్బారెడ్డి, కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: శింగరకొండ క్షేత్రాభివృద్ధి కృషి చేస్తానని టీటీడీ దేవస్థానం మాజీ చైర్మన్ వైవీ సుబారెడ్డి అన్నారు. శింగరకొండ దేవస్థానంలో చేపట్టిన నూతన రాతి ముఖ మండప నిర్మాణ కార్యక్రమంలో ఆదివారం నిర్వహించిన హోమంలో పాల్గొన్నారు. దేవస్థాన ఆవరణలో ఏర్పాటు చేసి బాలాలయం దేవస్థానంలోని ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేవస్థానం జీర్ణావస్థకు చేరడంతో టీటీడీ, దాతల సహకారంతో రూ.6 కోట్ల వ్యయంలో రాతి ముఖ మండపాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తొలుతగా అద్దంకిలోని కాకానిపాలెంలో టీటీడీ నిధులతో నిర్మిస్తున్న దేవాలయ పనులు పరిశీలించారు. కొన్ని పనులను ప్రారంభించారు. అనంతరం శింగరకొండలోని మారుతి భవన్ మలుపులో స్వామివారి ఆలయ ఉపాలయాలు, హోమశాల, వేద పురాణ ధార్మిక గ్రంథాలయం, అఖండ రామ నాయ సంకీర్తన పురాణ కాలక్షేప మండపం నిర్మాణాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమాల్లో రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన సహాయ కార్యదర్శి సుభద్ర, జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు పాల్గొన్నారు.

చట్టానికి అందరూ సమానమే..

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును సీఐడీ ఆధారాలతోనే అరెస్టు చేసిందని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. కోట్ల రూపాయలు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో పట్టుబడిన చంద్రబాబు చట్టానికి అతీతుడు కాదని వ్యాఖ్యానించారు. చట్టం ఎవరికైనా ఒకేటన్నారు.

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉత్తమ సీడ్ కంపెనీగా వేద సీడ్స్‌కు అవార్డు



డాక్టర్ చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కొరిటిపాడు(గుంటూరు): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉత్తమ సీడ్ కంపెనీగా వేద సీడ్స్‌కు సీడ్స్‌మెన్ అసోసియేషన్ అవార్డును అందజేసింది. ఉభయ తెలుగు రాష్ట్రాల సీడ్స్ మెన్ అసోసియేషన్ యాన్యువల్ అవార్డు–2023 కార్యక్రమం ఆదివారం విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించారు. ఉత్తమ సీడ్ కంపెనీ విభాగంలో వేద సీడ్స్ కంపెనీ ఈ అవార్డును కైవసం చేసుకుంది. వేద సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ పి.చంద్రశేఖర్ 30 సంవత్సరాలుగా వ్యవసాయ పరిశోధనలో చేసిన కృషిని అభినందిస్తూ ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి సత్కరించి ఈ అవార్డు అందజేశారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వేద సీడ్స్ ద్వారా నాణ్యమైన, అధిక దిగుబడుల్ని అందించే హైబ్రిడ్ విత్తనాల్ని రైతులకు అందించడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. అవార్డును అందజేసిన సీడ్స్ మెన్ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్, తులసి విశ్వంభర్, జనరల్ మేనేజర్ గుడి సతీష్‌కుమార్, హెచ్ఆర్ మేనేజర్ తోట రంగారావు, జీఎం టి.శ్రీనివాసరావు, పీఆర్వో ఇక్కుర్తి వెంకటేష్, గాజుల సాయిరాం పాల్గొన్నారు.

పోలీస్ పేరుతో మోసగించిన యువకుడి అరెస్టు

పిట్టలవానిపాలెం: పోలీసు అని చెప్పి మోసాలకు పాల్పడుతున్న యువకుడిని చందోలు పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రాజశేఖర్ ఆదివారం వివరాలు వెల్లడించారు. కర్లపాలెం మండల కేంద్రానికి చెందిన నక్కల శ్రీకాంత్ ఈనెల 6వ తేదీన ఖాజీపాలెం శివారు రామ్ నగర్‌కు చెందిన పెనుమెత్స నాగవర్మ కోళ్లఫారం వద్ద ఉండగా ఒక గుర్తు తెలియని వ్యక్తి వచ్చి పోలీస్ అని చెప్పి బెదిరించి రూ.5 వేలు వసూలు చేశాడు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం రాత్రి ఖాజీపాలెం పెట్రోలు బంక్ సమీపంలో నిందితుడు శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

రామకూరు కొండపై బాలుడి మృతి



లభ్యమైన బాలుడి మృతదేహం

జే పంగులూరు: ప్రమాదవశాత్తు బాలుడు కోనేరులో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రామకూరులోని కొండపై ఉన్న రామలింగేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో శనివారం చోటుచేసుకోగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ కేకే తిరుపతిరావు తెలిపిన వివరాలు.. చీరాల ప్రాంతానికి చెందిన దామర్ల రామకృష్ణ, కుమారుడు సాయి అఖిల్(10), కూతురు అనుశ్రీతో కలసి కొండపై ఉన్న రామలింగేశ్వర స్వామి దర్శనానికి శనివారం వచ్చారు. మధ్యాహ్నం సమయంలో కొండపై ఉన్న కోనేరులో సాయి అఖిల్ గ్రామంలోని కొంతమంది చిన్నారులతో కలసి ఈత కొట్టాడు. సాయంత్రం సమయంలో గుడి ఎదుట కూల్ డ్రింక్ తాగి, తన తండ్రి చెప్పినా వినకుండా కోనేరులో దిగాడు. నీటిలో బండపై ఉన్న పాచి మీద కాలు పెట్టేసరికి జారి కోనేరులో పడిపోయాడు. కుమారుడిని కాపాడుదామని తండ్రి కోనేరులో దిగేసరికి ఆ ప్రాంతంలో లోతు ఎక్కువగా ఉండటం వలన లోపలికి వెళ్లలేకపోయాడు. చేసేది లేక వెనుదిరిగి తన ఊరికి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులకు జరిగిన విషయం తెలియజేసి ఆదివారం ఉదయం రావడంతో మృతదేహం బయటికి తీశారు. ఈ మేరకు రేణింగవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు నవీన్

మార్టూరు: పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కోలలపూడిలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన నక్కా ఆంజనేయులు కుమారుడు నవీన్(27) గుంటూరులో హోటల్ వ్యాపారం చేస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం గ్రామంలో కొలుపులకు వచ్చిన నవీన్ ఆదివారం ఉదయం పురుగుమందు తాగి పొలంలో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు మార్టూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నవీన్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించగా పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వైద్యులు బంధువులకు అప్పగించారు. ఎస్ఐ కమలాకర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పవన్ కల్యాణ్ గొంతు చించుకోవడం సిగ్గుచేటు

డీసీసీ బ్యాంకు చైర్మన్ లాల్‌పురం రాము

పట్నంబజార్: కాపుల రిజర్వేషన్ కోసం ముద్రగడ పద్మనాభం పోరాటం చేస్తున్న సమయంలో చంద్రబాబు అన్యాయంగా దాడి చేయించినప్పుడు నోరు విప్పని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఇప్పుడు ఆయన అరెస్టు విషయంలో గొంతుచించుకోవడం సిగ్గుచేటని డీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు(లాల్‌పురం రాము) విమర్శించారు. ఆదివారం ఆయన బ్రాడీపేటలోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముద్రగడ అంశంలో కనీసం పరామర్శించడానికి వెళ్లని పవన్ కల్యాణ్, చంద్రబాబు అరెస్టు విషయంలో రోడ్డుపై పడుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఏపీలోకి రావాలంటే వీసా, పాస్‌పోర్టు కావాలని వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ముద్రగడ కాపుల అభ్యున్నతి కోసం గాంధేయ మార్గంలో ఇంట్లో కూర్చుని నిరాహార దీక్ష చేస్తుంటే ఆడా, మగా అని తేడా లేకుండా వారిపై చంద్రబాబు ప్రభుత్వం దాష్టీకంగా వ్యవహరించిన రోజు పవన్ కల్యాణ్ ఏమయ్యారని ప్రశ్నించారు. సొంత అన్న చిరంజీవి, దాసరి నారాయణరావు, అంబటి రాంబాబును గృహ నిర్బంధం చేసినప్పుడు హైదరాబాద్‌లో కూర్చున్న ఆయన ఈ రోజు చంద్రబాబుకు మద్దతుగా మాట్లాడటం అతడి విజ్ఞతకే వదిలేస్తానమని చెప్పారు. కాపులు ఆరాధ్య దైవంగా భావించే వంగవీటి మోహనరంగా మృతికి కారణమైన చంద్రబాబుకు సపోర్ట్ చేయడాన్ని యావత్ కాపుజాతి తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. కాపులకు ద్రోహం చేసిన చంద్రబాబుకు వత్తాసు పలకడంతో పవన్ కల్యాణ్ కూడా కాపుల ద్రోహుల జాబితాలో మిగిలిపోతారని విమర్శించారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో ఆయన్ను సాక్ష్యధారాలతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నారని వివరించారు. కాపులకు తీరని అన్యాయం చేసిన చంద్రబాబుకు మద్దతు పలికితే కాపుజాతి ఎంతో బాధపడుతుందనే అంశాన్ని పవన్ కల్యాణ్ గుర్తించాలని లాల్‌పురం రాము సూచించారు.

చీడ పారుడు వ్యాధిపై అవగాహన

జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి హనుమంతరావు

బాపట్లటౌన్: చీడ పారుడు వ్యాధిపై గొర్రెలు.. మేకల కాపరులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు తెలిపారు. జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి ఆదివారం సాక్షితో మాట్లాడారు. ప్రస్తుత సీజన్‌లో గొర్రెలు, మేకలకు చీడ పారుడు(నాచు రోగం) వ్యాధి ప్రబలే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇది వైరస్ వలన ప్రబలే వ్యాధి అన్నారు. ఈ వ్యాధితో జీవాల మరణాలు అధికంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ వ్యాధి బారిన పడిన గొర్రెలు, మేకలకు 105– 106 డిగ్రీల ఫారిన్ హీట్‌తో జ్వరం వస్తుంది. మేత, నీరు తీసుకోవడం మానేస్తాయి. జీవాలు నీరసంగా ఉంటాయి. నోటిలో పుండ్లు ఏర్పడి పెదాల వాపు వస్తుందని చెప్పారు. కళ్ల వెంట నీరు కారుతూ ఉంటుంది. చీడపారుడు ఉంటుంది. చూడి జీవాలు ఈసుకు పోతాయి. పిల్లల్లో మరణాల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా డిసెంబరు–ఏప్రిల్ నెలల మధ్య ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుందని చెప్పారు.

వ్యాధి నివారణ ఇలా..

ఈ వ్యాధిని నిరోధించేందుకు గాను ఈనెల 11వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. జిల్లాలో 4,78,600 డోసుల టీకాలను ఇప్పటికే అన్ని పశువైద్యశాలలో సిద్ధంగా ఉంచామన్నారు. 75 టీములను ఏర్పాటు చేసి ఈ టీముల ద్వారా టీకాలను జిల్లాలోని అన్ని గొర్రెలు, మేకలుకు ఉచితంగా వేయుటకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలోని గొర్రెలు, మేకల పెంపకందారులు అందరూ తమ జీవాలకు ఈ టీకాలను వేయించి ఈ వ్యాధి నుంచి తమ జీవాలను కాపాడుకోవాలని కోరారు.

మెగా లోక్ అదాలత్‌లో 3,888 కేసులు పరిష్కారం

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: జాతీయ మెగా లోక్ అదాలత్(9వ తేదీ) జిల్లాలో 3,888 కేసులు పరిష్కరించినట్లు జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదివారం తెలిపారు. కేసుల సత్వర పరిష్కారానికి చక్కని వేదిక లోక్ అదాలత్ అన్నారు. విచారణ దశలో ఉన్న కేసులు, కోర్టులో ట్రయిల్ పెండింగ్ ఉన్న కేసుల్లో కక్షిదారుల మధ్య రాజీ కుదిర్చి, 920 క్రిమినల్ కేసులు, 2968 పెట్టీ కేసులు మొత్తం కలపి 3888 కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. నిరంతరం పోలీస్‌స్టేషన్ ల పరిధిలో క్రిమినల్ కేసులు, కుటుంబ కలహాలు, భార్యాభర్తల వివాదాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ కేసులు ఇతర కేసులు నమోదై ఉంటాయన్నారు. ఆ కేసుల్లోని ఇరుపక్షాల కక్షిదారులు వారి సమస్యను కోర్టులో పరిష్కరించుకోవడానికి ఎక్కువ కాలపరిమితి పడుతుంటుందని చెప్పారు. అంతే కాకుండా ధనం కూడా వృథా అవుతుందన్నారు. అటువంటి కేసులు లోక్‌అదాలత్‌లో పరిష్కారం చేసుకుంటే బాధితులకు సకాలంలో సత్వర న్యాయం చేకూరుతుందని వెల్లడించారు.

చేనేతలు నాయకులైతేనే జీవితాల్లో మార్పు

చేనేత ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు అవ్వారు

చీరాల టౌన్: వ్యవసాయ రంగం తర్వాత రెండో అతిపెద్ద రంగమైన చేనేత రంగం అభివృద్ధి చెందాలన్నా.. చేనేతలు అన్నీ రంగాల్లో రాణించాలన్నా చేనేతలే నాయకులైతేనే నేతన్నల జీవితాల్లో మార్పు వస్తుందని చేనేత ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని ఈపురుపాలెంలో చేనేత ఐక్యవేదిక సెక్రటరీ శీలం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చేనేతలు జనాభా పరంగా ఎక్కువగా ఉన్నా చేనేత సమస్యలను పరిష్కరించే వారే లేకుండా పోయారన్నారు. చేనేత నాయకులే ప్రజా ప్రతినిధులుగా ఉంటే సమస్యలకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. బీసీలు అన్నీరంగాల్లో ముందుండాలని దామాషా ప్రకారం సీట్లు కేటాయించి రాజకీయ ప్రాధాన్యం కల్పించాలన్నారు. చేనేత రంగం అభివృద్ధికి పాటుపడాలనే లక్ష్యంతోనే జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీని స్థాపించామని, బీసీలు అందరూ పార్టీకి అండగా నిలవాలన్నారు. బీసీలు అందరు ఐక్యంగా ఉండి రాజకీయ శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు.

టీటీడీ అన్నదానానికి తరలిన కూరగాయలు



లారీని ఊరేగింపుగా పంపిస్తున్న నిర్వాహకులు

మార్టూరు: శ్రీవారి అన్నదానంలో భాగస్వామ్యం పంచుకోవడం కోసం మార్టూరు పరిసర గ్రామాల రైతులు పండించిన కూరగాయలు ఆదివారం తిరుమలకు తరలి వెళ్లాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదానంలో భాగంగా గతంలో మార్టూరు కూరగాయల మార్కెట్‌కు చెందిన కూరగాయలు పంపాల్సిందిగా ఆదేశాలు రావడంతో పంపించారు. తిరిగి ఆరు నెలలకు మరోసారి కూరగాయలు పంపాల్సిందిగా టీటీడీ నుంచి కబురు రాగా స్థానిక కూరగాయల మార్కెట్ నుంచి లారీ కూరగాయలు బయలుదేరగా స్థానిక ఎఫర్ట్, ఇన్నర్ వీల్ క్లబ్ మహిళలు కోలాట ప్రదర్శన రహదారిపై ఊరేగింపు నిర్వహించి తిరుమలకు పంపించారు. ఈ సందర్భంగా భక్తులకు శ్రీవారి లడ్డు ప్రసాదాలు నిర్వాహకులు పంపిణీ చేశారు.

ప్రతి మనిషికీ సామాజిక బాధ్యత అవసరం

- రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ ముప్పాళ్ల సుబ్బారావు
- ఘనంగా రోటరీ రోటోఫెస్ట్–2023 ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ సుబ్బారావు

గుంటూరు వెస్ట్(క్రీడలు): మానవుడు సంఘజీవని, ఒకరికొకరు సహకరించుకుంటూ ముందుకు నడవడమే సామాజిక బాధ్యతని రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ ముప్పాళ్ల సుబ్బారావు పేర్కొన్నారు. యువతను, చిన్నారులను ప్రోత్సహించేందుకు రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో రోటోఫెస్ట్–2023 ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ప్రారంభమయ్యింది. తొలి రోజు క్రీడా పోటీల్ని లాంఛనంగా ప్రారంభించిన సుబ్బారావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ తొలి నుంచీ సామాజిక హితం కోసం, ప్రజల బాగు కోసం కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, గేమ్స్ నిర్వహిస్తూ యువతను ప్రోత్సహిస్తోందని చెప్పారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు కె.వి.భాస్కరరావు మాట్లాడుతూ తొలి రోజు 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, 400 మీటర్ల రిలే పోటీల్లో సుమారు 300 చిన్నారులు పాల్గొన్నారని తెలిపారు. వివిధ క్రీడా విభాగాల్లో ఈ నెల 24 వరకు పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతుల్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చెరుకూరి శ్రీనివాసరావు, కోశాధికారి కె.బి.వి.ప్రసాద్, డైరెక్టర్స్ కె.పి.కె.విశ్వేశ్వరరావు, బి.నాగసాయి ప్రసాద్, బాచనబోయిన ఆంజనేయులు పాల్గొన్నారు.

డీలర్లకు శాస్త్ర పరిజ్ఞానం అవసరం

గుంటూరు రూరల్: విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్లకు శాస్త్ర పరిజ్ఞానం అవసరమని ఆత్మ పథకం సంచాలకుడు పి. రామాంజనేయులు సూచించారు. నగరంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో గల కృషి భవన్‌లో ఆదివారం ఉమ్మడి గుంటూరు జిల్లాలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అమ్మే వ్యాపారులకు సంవత్సరం డిప్లొమా కోర్సు, శాస్త్ర పరిజ్ఞానంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ అనంతరం పరీక్షల్ని నిర్వహించారు. కోర్స్ కో–ఆర్డినేటర్‌గా పావులూరి నీలకంఠేశ్వరరావు వ్యవహరించారు. పరీక్షల పర్యవేక్షణ అధికారిగా హైదరాబాద్‌లోని మేనేజ్‌కి చెందిన కంచన్ భగవత్, ఎగ్జామినర్‌గా గుంటూరు జిల్లా భూసార పరీక్ష కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎస్.రామ్మోహనరావు వ్యవహరించారు.

జంప్ రోప్ పోటీల విజేత గుంటూరు

తెనాలి: స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కమిటీ, తెనాలి ఆధ్వర్యంలో స్థానిక చెంచుపేటలోని అన్నాబత్తుని సత్యనారాయణ స్టేడియంలో రెండురోజులుగా నిర్వహించిన 4వ రాష్ట్ర సబ్ జూనియర్ జంప్ రోప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. పట్టణానికి చెందిన డబుల్ హార్స్ మినప గుళ్లు, మైటీ స్పోర్ట్స్ అకాడమీ సౌజన్యంతో జరిగిన పోటీల్లో 26 జిల్లాల్నుంచి 850 మందికి పైగా బాలబాలికలు పాల్గొన్నారు. గుంటూరు జిల్లా విన్నర్స్‌గా, నంద్యాల జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ముగింపు కార్యక్రమంలో అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డీజే సునీల్, స్టేడియం హ్యాండ్‌బాల్ కోచ్ కె.నాగరాజు, ఆంధ్రప్రదేశ్ జంప్ రోప్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణయ్య, కార్యదర్శి సి.వి.సుబ్బయ్య, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కె.జయరావు, కోచ్‌లు అనిల్, రాము, సుబ్బు, శిరీష, గోపి పాల్గొన్నారు.